ఇంజినీరింగ్ ఫీజుల మోత!

- ట్యూషన్ ఫీజుల పెంపునకు రంగం సిద్ధం
- నేటి నుంచి టీఏఎఫ్ఆర్సీ విచారణలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఇంజినీరింగ్ ఫీజుల మోత మోగనున్నది. భారీగా ఫీజుల పెంపునకు రంగం సిద్ధమైంది. ట్యూషన్ ఫీజుల పెంపునకు తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్ఆర్సీ) చేపట్టిన కసరత్తు చివరిదశకు చేరింది. ఇప్పటికే కాలేజీల నుంచి ప్రతిపాదనలు స్వీకరించిన టీఏఎఫ్ఆర్సీ మంగళవారం నుంచి కాలేజీల వారీగా విచారణ చేపట్టనున్నది. మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో రోజుకు 19-20 కాలేజీల ఫీజులపై విచారించనున్నది. సాధారణంగా ఇంజినీరింగ్ కోర్సుల ట్యూషన్ ఫీజులను మూడేండ్లకోసారి పెంచుతున్నారు. చివరగా 2022-23లో పెంచగా.. 2024-25 విద్యాసంవత్సరంతో గడువు ముగిసింది. 2025-28 బ్లాక్ పీరియడ్‌కు ఫీజులు పెంచేందుకు టీఏఎఫ్ఆర్సీ ప్రతిపాదనలు స్వీకరించగా, రాష్ట్రంలోని 163 కాలేజీలు ఫీజుల సవరణకు దరఖాస్తు చేసుకోగా, 19 కాలేజీలు చేసుకోలేదు.

నేడు 19 కాలేజీలపై విచారణ..

ఫీజుల సవరణపై టీఏఎఫ్ఆర్సీ మంగళవారం 19 కాలేజీలను విచారించనున్నది. వీటిలో అనురాగ్, అరోరా, అవంతి, బీవీ రాజు, ఏవీఎన్, బాలాజీ, మహావీర్, అబ్దుల్ కలాం, ఏస్, ఐజా, అన్నమాచార్య, అనుబోస్, అర్జున్ తదితర కాలేజీలు ఉన్నాయి. ఈ నెల 27న, మార్చి 1, 4, 5, 7, 8, 10 తేదీల్లో రోజుకు కొన్ని కాలేజీల చొప్పున విచారించనున్నారు. కాలేజీలు సమర్పించిన ఆదాయం, ఖర్చుల ఆధారంగా ఆడిటర్లు కాలేజీలను విచారిస్తారు.

పలు కాలేజీల ప్రతిపాదిత ఫీజులు..

కాలేజీ	ప్రతిపాదిత ఫీజు
సీబీఐటీ	2,94,614
వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి	2,84,200
ఎమ్జీఐటీ	2,45,000
వాసవి	2,16,000
ఎస్సార్	2,00,000
సీవీఆర్	1,98,000
వర్ధమాన్	1,90,000
గోకరాజు రంగరాజు	1,90,000

పదో తరగతి మెమోలను ఎట్లా ముద్రిద్దాం

విద్యాశాఖ తర్జనభర్జన.. నిపుణులతో చర్చలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : పదో తరగతిలో గ్రేడింగ్ విధానం ఎత్తివేత నేపథ్యంలో విద్యార్థులకు అందించే మెమోలను ఎలా ముద్రించాలన్న దానిపై విద్యాశాఖ తేల్చుకోలేకపోతున్నది. ఏ పద్ధతిలో ముద్రించాలన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నది. సూచనలు, సలహాలు స్వీకరించేందుకు హెచ్ఎంలు, నిపుణులతో సోమవారం సంప్రదింపులు జరిపింది. పదో తరగతిలో ఈ విద్యాసంవత్సరం నుంచి గ్రేడింగ్ విధానాన్ని ఎత్తివేసింది. గతంలో మార్కుల విధానం అమలైనప్పుడు విద్యార్థులు సాధించిన మార్కులను బట్టి ఫస్ట్‌క్లాస్, సెకండ్ క్లాస్, థర్డ్ క్లాస్, పాస్ అని మెమోలపై ముద్రించేవారు. తాజాగా మార్కులతో మెమోలను ముద్రించాల్సి ఉండటంతో పాత విధానాన్ని కొనసాగించడమా లేక కేవలం ఎన్ని మార్కులు వస్తే అన్ని మార్కులేయడమా? అన్న దిశగా చర్చలు సాగించారు. గతంలో ఎస్సెస్సీలో ఫెయిలైన వారికి రెండు లేదా మూడేండ్లపాటు అవకాశం కల్పించి, ఆ తర్వాత కొత్త విధానంలోకి మార్చాలని కొందరు అధికారులు సూచించారు. పలు అంశాలపై స్పష్టతరాగా వాటిపై ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపించనున్నట్టు తెలిసింది.

ఉన్నత విద్యామండలిలో ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉన్నత విద్యామండలిలో ప్రభుత్వం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించింది. 35 మంది విద్యార్థులను ఎంపికచేసింది. వీరిలో ఇంజినీరింగ్, డిగ్రీ కాలేజీల విద్యార్థులున్నారు. ఆయా విద్యార్థులకు ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. 2 నెలల వ్యవధి గల ఈ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. వీరికి ఆన్‌లైన్ ద్వారా పలు రకాల స్కిల్స్‌ను నేర్పిస్తామని పేర్కొన్నారు. ఇంటర్న్‌షిప్ పోర్టల్ ద్వారా విద్యార్థులు, కంపెనీలను అనుసంధానం చేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు.

3 నుంచి ఈ-సెట్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించే టీజీ ఈ-సెట్ నోటిఫికేషన్ విడుదలయ్యింది. మార్చి 3 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకానుంది. ఏప్రిల్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ-సెట్ పరీక్షను మే 12న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు.

లాసెట్, పీజీ లాసెట్ నోటిఫికేషన్ విడుదల

- 1 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు
- జూన్ 6న పరీక్ష.. 25న ఫలితాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : లాసెట్, పీజీ లాసెట్ నోటిఫికేషన్ విడుదలయ్యింది. మూడేండ్లు, ఐదేండ్ల లాతోపాటు ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మార్చి 1 నుంచి ప్రారంభంకానుంది. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని లాసెట్, పీజీ లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి తెలిపారు. రూ. 500 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 25, రూ. వెయ్యి ఆలస్య రుసుముతో మే 5, రూ. రెండువేల ఆలస్య రుసుముతో మే 15, రూ.నాలుగువేల ఆలస్య రుసుముతో మే 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు మే 20 నుంచి 25 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. మే 30న హాల్‌టికెట్లు విడుదల చేయనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 6న పరీక్షలు నిర్వహించి, 25న ఫలితాలు విడుదల చేయనున్నట్టు వెల్లడించారు.

నేటి నుంచి ఎప్‌సెట్‌కు దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తుల నేపథ్యంలో విద్యార్థుల సందేహాల నివృత్తికి జేఎన్టీయూ రెండు హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేసింది. వివరాలకు 74169 23578, 74169 08215 నంబర్లను సంప్రదించవచ్చని ఎప్‌ఎట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ వెల్లడించారు.

ఇంటర్ హాల్‌టికెట్ల విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షల హాల్‌టికెట్లను బోర్డు సోమవారం విడుదల చేసింది. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఇచ్చింది. మార్చి 5 నుంచి 25 వరకు పరీక్షలు జరగనున్నాయి. 4,88,316 ఫస్టియర్, 5,08,225 సెకండియర్ విద్యార్థుల చొప్పున మొత్తం 9,96,541 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజ్‌పై స్టేటస్‌కో

హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల క్రమబద్ధీకరణపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టేటస్ కో విధించింది. యథాతథ స్థితిని కొనసాగించవచ్చని స్పష్టంచేసింది. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన జీవో-16పై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోమవారం కేసును విచారించిన సుప్రీం కోర్టు స్టేటస్ కోను జారీచేసినట్టు అధ్యాపక సంఘాల నేతలు శ్రీనివాస్, సురేశ్ వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత పోరుబాటే

సీపీఎస్‌టీఈపీ టీఎస్ హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ హామీ ఇచ్చినట్టు సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని, లేదంటే ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత పోరుబాట పట్టనున్నట్టు సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్రం(సీపీఎస్‌టీఈఏ టీఎస్) హెచ్చరించింది. మాయమాటలు చెప్పి పాత పెన్షన్‌ను పునరుద్ధరిస్తామంటూ హామీలిస్తూ కాంగ్రెస్ సర్కారు పబ్బంగడుపుతోందని సంఘం అధ్యక్షుడు దామక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటి భూపతిరావు ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించాలని వారు సూచించారు.